సీఎం రేవంత్‌రెడ్డి నమ్మక ద్రోహి

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ జోలికొస్తే ఖబడ్దార్
- మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్

నర్సాపూర్, సెప్టెంబర్ 6: పార్టీ మారినందుకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని ద్రోహి అంటున్న కాంగ్రెస్ నాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి కూడా పార్టీ మారాడని, ఆయన కూడా పెద్ద ద్రోహి అని మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్ ధ్వజమెత్తారు. శుక్రవారం నర్సాపూర్ లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ నాయకులు విమర్శించినందుకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకుడు సత్యంగౌడ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి చేయలేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించడం సరికాదన్నారు. అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గం బీఆర్ఎస్ హయాంలో ఎంత అభివృద్ధి చెందిందో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అడగాలన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు నోరు అదుపు లో పెట్టుకుని మాట్లాడాలని, బీఆర్ఎస్ నాయకుల జోలికొస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. సమావేశంలో ఆత్మకమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్, షేక్‌హుస్సేన్, రాజేందర్, సామ్యానాయక్, ప్రసాద్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

పుట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు సాధియా

సాధియా

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 6: జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలికల పుట్‌బాల్ పోటీలకు సాధియా ఎంపికైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా పుట్‌బాల్ ఆసోసియేషన్ కార్యదర్శి నాగరాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. కల్వకుర్తిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పుట్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న సాధియా ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల పుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యింన్నారు. ఈనెల 9 నుంచి 13 వరకు మధ్యప్రదేశ్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో సాధియా పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య

రేనేష్(ఫైల్)

మనోహరాబాద్, సెప్టెంబర్ 6: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పర్కిబండ గ్రామానికి చెందిన మంచోళ్ల రేనేశ్ (27) ఉపాధి నిమిత్తం కాళ్లకల్‌లో భార్య, పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. రేనేష్‌కు తరుచూ మూర్చ రావడం, అనారోగ్యానికి గురవుతుండటంతో మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో అనారోగ్య సమస్యతో మనస్తాపానికి గురైన రేనేశ్ శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అట్టహాసంగా ముగిసిన డిమాక్స్ హ్యాకథాన్

విజేతలకు బహుమతులను అందజేస్తున్న ముఖ్య అతిథి, యాజమాన్యం

నర్సాపూర్,సెప్టెంబర్6: నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో జాతీయ స్థాయి 24 గంటల డిమాక్స్ హ్యాకథాన్ శుక్రవారం అట్టహాసంగా ముగిసింది. టెక్ మహీంద్రా కంపెనీకి చెందిన డెలివరీ హెడ్ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ హ్యాకథాన్‌లో సాఫ్ట్‌వేర్ విభాగంలో వాసవి ఇంజినీరింగ్ కళాశాల, హార్డ్ వేర్ విభాగంలో బీవీఆర్ఐటీ నర్సాపూర్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. సాఫ్ట్‌వేర్ విభాగంలో బీవీఆర్ఐటీ హైదరాబాద్ రెండో స్థానంలో, గోకరాజు ఇంజినీరింగ్ కళాశాల మూడో స్థానంలో నిలిచారు. ఎస్ఆర్ యూనివర్సిటీ వీఎన్ఆర్ కళాశాల, ఐఐటీ భీమవరం కన్సలేషన్ విభాగంలో విజేతలుగా నిలిచారు. కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, సీఎస్‌బీఎస్ విభాగ అధిపతి భీమా అభినందించారు. విజేతలకు రూ.50 వేలు నగదు బహుమతిగా అందజేశారు. చైర్మన్ విష్ణురాజుకి, వైస్ చైర్మన్ రవి చంద్రన్ రాజగోపాల్‌కి, సెక్రటరీ ఆదిత్య విస్సంకి, ప్రిన్సిపాల్ సంజయ్ దూబేకి, మేనేజర్ బాపిరాజు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

కుమ్మరి కుంటలో పడి వ్యక్తి గల్లంతు

అశోక్ (ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబర్ 6: కుంటలో పడి ఓ వ్యక్తి గల్లంతైన ఘటన శుక్రవారం మండలంలోని రుస్తుంపేట్‌లో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం రుస్తుంపేట్ గ్రామానికి చెందిన గుండం అశోక్ (50) రోజులాగే గురువారం పశువులను మేతకు తీసుకెళ్తాడు. గురువారం సాయంత్రం పశువులు ఇంటికి వచ్చిన అశోక్ మాత్రం రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా జాడ తెలియరాలేదు. శుక్రవారం ఉదయం అటవీ సమీపంలోని కుమ్మరి కుంట వద్ద అశోక్ బట్టలు, చెప్పులు కనిపించడంతో అందులో పడి గల్లంతైనట్లు నిర్ధారించుకుని కటుంబ సభ్యులు, పోలీసులు, గ్రామస్తులు కలిసి గాలించారు. అశోక్ మానసికి దివ్యాంగుడని కుటుంబీకులు తెలిపారు. శుక్రవారం వర్షం కురియడంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. దీంతో శనివారం గాలిస్తామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

యూడైస్‌లో వివరాలు నమోదు చేయాలి

కొల్చారం, సెప్టెంబర్ 6: యూడైస్‌లో విద్యార్థుల కచ్చితమైన వివరాలను పొందుపర్చాలని ఎంఈవో నీలకంఠం ఆదేశించారు. కొల్చారం జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం యూడైస్ రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లకు యూడైస్‌పై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ యూడైస్ ఆధారంగానే పాఠశాలలకు మౌలిక వసతులు, నిధులు, జిల్లా స్థాయి గ్రేడ్ పాయింట్స్ ఇస్తారని, అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను యూడైస్ లో నమో దు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మూడో, ఆరవ, తొమ్మిదో తరగతి విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ సత్యనారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడె శ్రీధర్‌రెడ్డి, టీచర్లు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్సీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 6: పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సీ ఉదయ్ కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, ఈద్ మిలాద్ నబీ ఇతర పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వినాయక మండపాల నిర్వాహకులు, పీస్ కమిటీ సభ్యులకు సూచించారు. ఏమైన ఘటనలు జరిగితే పోలీసుల దృష్టికి లేదా డయల్ 100కు, జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు 8712657888 సమాచారం అందించాలన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రేగోడ్, సెప్టెంబర్ 6: వినాయక మండపాల వద్ద అనుమతిలేనిదే విద్యుత్ కనెక్షన్లు తీసుకోరాదని ఏఈ మహమ్మద్ యాసిన్ అలీ ప్రకటనలో తెలిపారు. మండలంలో గణేశ్ పండగను పురస్కరించుకొని మండపాల వద్ద విద్యుత్‌కు పోలీస్ పర్మిషన్ లెటర్, జాయింట్ లేని సర్వీస్ వైర్ తీసుకొచ్చి లైన్‌మెన్‌కు ఇస్తే కనెక్షన్ ఇస్తారని తెలిపారు.

జై గణేశా.. జైజై గణేశా..

- నేడు వినాయక చవితి
- జిల్లాలో ముస్తాబైన మండపాలు
- నవరాత్రి ఉత్సవాలకు భారీగా ఏర్పాటు
- విగ్రహాల విక్రయ కేంద్రాల వద్ద కోలాహలం
- భారీగా పెరిగిన విగ్రహాల ధరలు

మెదక్ మున్సిపాలిటీ: అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక విగ్రహాలు

మెదక్ నుంచి ట్రాక్టర్‌లో వినాయక విగ్రహాలను తీసుకెళ్తున్న మండపాల నిర్వాహకులు

రామాయంపేట పట్టణంలో విక్రయానికి పెట్టిన రూ.30 వేలకు అతిపెద్ద వినాయక విగ్రహాలు

తూప్రాన్ పుట్టకోట ప్రభుత్వ పాఠశాలలో వినాయక చవితి వేడుకలు జరుపుకొంటున్న విద్యార్థులు

వెల్దుర్తి: వినాయక నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న వెల్దుర్తి భూలక్ష్మీమాత దేవాలయం

జిల్లా ప్రజలు వినాయక చవితి జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. జిల్లాలో ఎటుచూసినా వినాయక చవితి పండుగ సందడి కనిపిస్తున్నది. జిల్లా కేంద్రంతో పాటు తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట డివిజన్ కేంద్రాల్లోని మార్కెట్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల కొనుగోలు కేంద్రాల జనంతో కిటకిటలాడాయి. గణేశుడి విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి. వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వివిధ రకాల మండపాలు ఏర్పాటు చేసేందుకు మండళ్ల నిర్వాహకులు నిమగ్నమయ్యారు. వినాయకులకు ప్రీతిపాత్రమైన తామర ఆకులు, తుమ్మి ఆకులు, చింతకాయల, మారేడుకాయలు లాంటి అనేక రకాల ఆకులు, వివిధ రకాలు పూజా సామగ్రి, పూలు కొనుగోలు చేయడానికి జనం రావడంతో మార్కెట్లు కిటకిటలాడింది.

- మెదక్ మున్సిపాలిటీ/మెదక్ రూరల్ /రామాయంపేట/ వెల్దుర్తి/తూప్రాన్/మనోహరాబాద్/రేగోడ్, సెప్టెంబర్ 6

రామాయంపేట: వినాయక చవితికి సిద్ధంగా ఉన్న దండలు, ఇతర వస్తువులు

మెదక్‌లో వినాయక మండపాల ఏర్పాట్లు

మెదక్‌లో పూజా సామగ్రి, పూలు విక్రయాలు

వెల్దుర్తి: ఎల్కపల్లి పాఠశాలలో మట్టి గణపతులు

మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన పువ్వులు

పొంగిపొర్లుతున్న మంజీరా

చిలిపిచెడ్:చాముండేశ్వరీ ఆలయం వద్ద నిండికుండలా ప్రవహిస్తున్న మంజీరా

చిలిపిచెడ్:చండూర్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో రాజశేఖర్‌గౌడ్

నర్సాపూర్ మున్సిపల్ విఘ్నేశ్వర్ కాలనీలో ప్రవహిస్తున్న వరద నీరు

చిలిపిచెడ్, సెప్టెంబర్ 6: మండలంలోని చిట్కుల్ శివారులో ఉన్న చాముండేశ్వరీ ఆలయం వద్ద మంజీరా నది నిండుకుండలా ప్రవహిస్తున్నది. మంజీరా నదిలో వచ్చే వరదకు పాత బ్రిడ్జిని తాకుతూ ప్రవహిస్తున్నది. కురుస్తున్న వర్షానికి కుంటలు, చెరువులు నిండాయి. దీంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంజీరా ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది పరీవాహక ప్రాంతంలోకి ఎవరూ వెళ్లవద్దని ఎస్సై యాదగిరి రెడ్డి హెచ్చరించారు.

పత్తిలో నీటి నిల్వలను తొలిగించాలి

వర్షాలతో పత్తి పంటలో నీటి నిల్వలు తొలిగించాలని ఏవో రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చండూర్‌లో రైతులు యాదగిరి, భూపాల్ పత్తి పంటను ఏఈవో రమ్యతో కలిసి పరిశీలించారు. పత్తి నీటి ముంపు తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను కలిపి బూస్టర్ డోస్‌గా వేయాలని సూచించారు. మెగ్నీషియం ధాతువు లోపం రావడానికి అవకాశం ఉంటుందని, దీని నివారణకు 1 శాతం మెగ్నీషియం సల్ఫేట్‌ను పిచికారీ చేయాలన్నారు.

నర్సాపూర్‌లో భారీ వర్షం

నర్సాపూర్, సెప్టెంబర్ 6: నర్సాపూర్‌లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో రోడ్లు, కాలనీలు జలమలమయ్యారు. మున్సిపాలిటీలోని విఘ్నేశ్వర కాలనీలో వరద చేరి కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. నర్సాపూర్ ఆర్టీసీ బస్టాప్ లోని కుంట పూడ్చివేయడంతో నీరు విఘ్నేశ్వర్ కాలనీలోకి ప్రతిసారి రావడం జరుగుతున్నది. శుక్రవారం సంతరోజు కావడంతో వర్షం కారణంగా ప్రజలు, కూరగాయల వ్యాపారస్తులు ఇబ్బందులకు గురయ్యారు.

నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది: డీఈవో

విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఈవో రాధాకిషన్

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 6: ఓటమి రేపటి గెలుపునకు నాంది అని డీఈవో రాధాకిషన్ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ముగింపు సమావేశానికి డీఈవో హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్ 17 విభాగంలో కబడ్డీ విన్నర్‌గా మిర్జాపల్లి జడ్పీ పాఠశాల, రన్నర్‌గా చిన్నశంకరంపేట మోడల్ పాఠశాల నిలిచారు. ఖోఖోలో విన్నర్‌గా చిన్నశంకరంపేట బాలికల గురుకుల పాఠశాల, రన్నర్‌గా చిన్నశంకరంపేట తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థులు నిలిచారు. వాలీబాల్‌లో రన్నర్‌గా మడూర్ జడ్పీ పాఠశాల, విన్నర్‌గా మిర్జాపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో ఎస్టీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య పాల్గొన్నారు.

పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తా

- పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్

మాట్లాడుతున్న పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 6: పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు, చేనేత అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మెదక్‌లోని భారత్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు మేకల జయరాములు అభినందన సభను ఏర్పాటు చేశారు. శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సభలో మెదక్ సంఘం పట్టణ అధ్యక్షుడు రాంచంద్రం, ఆయా మండలాల అధ్యక్షులు రమేశ్, సుధాకర్, రాము, యాదగిరి, ప్రభాకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

- దివ్యాంగులకు ఉపకరణాలు అందించాలి
- మెదక్‌లో ప్రభుత్వ వైద్య కలశాల కోసం కృషి చేస్తా
- ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, సెప్టెంబర్ 6(నమస్తే తెలంగాణ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రతి పథకం ప్రజలకు అందేలా అధికారులు చూడాలని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధిపై కోఆర్డినేషన్, మానిటరింగ్ (దిశ) సమావేశానికి ఎంపీ అధ్యక్షత వహించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, సివిల్ సప్లై, హౌసింగ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంబంధిత శాఖల సమగ్ర సమాచారాన్ని ఆయా శాఖల అధికారుల విషయాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళిక ప్రకారం ప్రజా ప్రయోగార్థం అమలుచేసే ప్రతి పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అవి లబ్ధిదారులకు అందేలా అధికారులు చూడాలన్నారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పథకం ద్వారా జిల్లాలో పంచాయతీ భవనాల నిర్మాణాలు చేయాలన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలు రోగులకు అందించడంలో ప్రైవేట్ దవాఖానలు ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలన్నారు. టీ డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని దవాఖానల్లో అధికారులు తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లాలో డెంగీ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. మెదక్ మెడికల్ విషయంలో కాలేజీ నివేదిక కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లిందని, అక్కడ నుంచి త్వరలోనే కేంద్రం హెల్త్ సెక్రటరీకి వచ్చేలా చూస్తామన్నారు. మెదక్ మెడికల్ కాలేజీ ఇన్ఫ్రాస్ట్రక్చర్, బిల్డింగ్ బాగుందనీ మెడికల్ కాలేజీ ఇవ్వాలని కేంద్రం దగ్గరికి వెళ్లి అప్పీల్ చేస్తామన్నారు. దిశా కమిటీలో ఎంపీలు చర్చించిన అంశాలను సంబంధిత శాఖల ద్వారా సమావేశాలు నిర్వహించుకుని తగు ఆదేశాలు జారీ చేస్తూ నిర్దేశిత గడువు తేదీలోగా నివేదికలు తయారు చేసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ మామిడ్ల జ్యోతి కృష్ణ, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొల్చారం, సెప్టెంబర్ 6: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. డ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలో ని పైతర గ్రామాన్ని శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. ప్రజలు వ్యక్తిగత, శారీరక శుభ్రతపై దృష్టి సారిస్తూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయనతో డీపీవో యాదయ్య, ఎంపీడీవో కృష్ణవేణి, ఉన్నారు

విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ

స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేస్తున్న వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డి

నిజాంపేట, సెప్టెంబర్ 6: రాంపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డి స్పోర్ట్స్ దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తనవంతుగా సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం. పద్మారెడ్డి, మండల కో-ఆప్షన్ మాజీ మెంబర్ గౌస్, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేశ్, చంద్రకాంత్, కుమారస్వామి, ఫాతిమాభాను ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామాయంపేట, సెప్టెంబర్ 6: పెంకుటిల్లు కూలిపోయి, నిరాశ్రయులైన మండలంలోని అక్కన్నపేటకు చెందిన మల్లుపల్లి అనుసూయ కుటుంబానికి డాక్టర్ మోహన్ నాయక్ రూ.5 వేల ఆర్థిక సాయం, నెలరోజు ల నిత్యావసరాలు శుక్రవారం అందజేశారు.

సేవాలాల్ ఆలయానికి విరాళం

రామాయంపేట, సెప్టెంబర్ 6: సేవాలాల్, జగదాంబికా ఆలయానికి మండలంలోని కోనాపూర్ గిరిజన తండాకు చెందిన టీచర్ ఉమ్లా నాయక్ రూ.11వేల విరాళాన్ని శుక్రవారం అందజేశారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

మెదక్‌రూరల్, సెప్టెంబర్ 6: అనధికారిక ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు పరిశీలిస్తున్నారు. మండలంలోని మంబోజిపల్లిలో 94 దరఖాస్తులు ఉండగా, శుక్రవారం 24 దరఖాస్తులను రెవెన్యు అధికారి కిశోర్, పంచాయతీ కార్యదర్శి నగేశ్ అప్‌లోడ్ చేశారు.

ఫైడే.. డ్రైడే

శివ్వంపేట, సెప్టెంబర్ 6: శివ్వంపేట సెక్టార్ లోని పోతిరెడ్డిపల్లితండాలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష ఆధ్వర్యంలో శుక్రవారం ఫైడే.. డ్రై డేను నిర్వహించారు. తండాలోని ప్రతి ఇంటి వద్ద పరిసరాల పరిశుభ్రత, నిల్వ నీటిని పారబోశారు.

చిన్నారుల ఆశ్రమానికి చేయూత

శివ్వంపేట, సెప్టెంబర్ 6: హైదరాబాద్‌కు చెందిన అమ్మానాన్న చిన్నారుల ఆశ్రమానికి శివ్వంపేట మాజీ సర్పంచ్ స్రవంతి నవీన్‌గుప్తా తనవంతు సాయంగా రూ.16 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

అల్లాదుర్గం ఎంపీడీవోగా చంద్రశేఖర్



అల్లాదుర్గం, సెప్టెంబర్ 6: అల్లాదుర్గం ఎంపీడీవోగా చంద్రశేఖర్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శివ్వంపేట ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ప్రమోషన్‌పై అల్లాదుర్గం ఎంపీడీవో వచ్చారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16 K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640258899 / 9640468899.
NT-331758-All

కావలెను

★సిద్దిపేట జిల్లాలో అన్ని మండలాలకు భారత్‌పే & భారత్ సి.సి.ఎస్. సాఫ్ట్‌వేర్ సేవలు నిర్వహించడానికి యువతీ/యువకులు కావలెను. ఉచిత ట్రైనింగ్, Age: 18-50 సం॥లు. సంప్ర॥ 8866324466.
NTK-00000

KIDNY STONES

★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం, 47 సం॥ అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones, Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580.
NT-332617

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.